సాక్షి
వైఎస్సార్ జిల్లా
బుధవారం । 19 । జూన్ । 2024



ఘనంగా బర్సీ మహోత్సవం

కమలాపురం పట్టణంలో వెలసిన దర్గా–ఎ–గఫారియా, జహీరియా పీఠాధిపతి హాజి జహీరుద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. - 8లో



అమ్మో.. దోమ.!

వైఎస్సార్ జిల్లాలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో నీరు నిలిచి పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురుగు పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారింది. - 8లో

గరిష్టం/కనిష్టం
35.8/24.0

వాతావరణం

జిల్లాలో మంగళవారం 24.0 – 35.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

పొంగి పొర్లిన డ్రైనేజీ కాలువలు



అప్సర సర్కిల్ సమీపంలో పేరుకుపోయిన మురికి

కడప కార్పొరేషన్: కడప నగరంలో సోమ వారం రాత్రి కురిసిన భారీ వర్షంతో డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లాయి. మంగళవారం ఉదయానికి రహదారులపై ఎక్కడ చూసినా వాననీరే కనిపించింది. నీరు లేనిచోట పెద్ద ఎత్తున నల్లగా మురికి పేరుకుపోయింది. వాన వల్ల ఆర్టీసీ బస్టాండు చుట్టు ప్రక్కల ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్టాండు, జిల్లా కోర్టు, ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు ఔట్ గేట్, కోటిరెడ్డి సర్కిల్ ప్రాంతాల్లో భారీ స్థాయిలో వర్షపునీరు నిలవడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం వల్ల పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ప్రొద్దుటూరులో భారీ వర్షం

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలో మంగళవారం తెల్లవారు జామున 3 నుంచి పడిన వర్షానికి పట్టణం తడిసి ముద్ద అయింది.తహసీల్దారు కార్యాలయ ఆవరణం, కొర్రపాడు రోడ్డు, పూలమార్కెట్, గాంధీరోడ్డు, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



మార్కెట్‌లో నిలిచిన నీళ్లలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

దంచి కొట్టిన వాన

- పొలాలు పదును.. పంటల సాగుకు అదును
- అత్యధికంగా సీకేదిన్నెలో 125.4 మి.మీ. వర్షం
- కడప నగరంలో జలమయమైన రోడ్లు
- వర్షం రాకతో జిల్లాలో పంటల సాగుకు మరింత ఊపు
- ఇప్పటికే ముమ్మరంగా పచ్చిరొట్ట, వరిపంట సాగు పనులు
- ఊపందుకోనున్న పత్తి, వేరుశనగ, మినుము పంటల సాగు
- పొలం పనుల్లో బిజీ అయిన అన్నదాతలు



కడప ఆర్టీసీ బస్టాండ్‌లో చెరువును తలపిస్తున్న వర్షపు నీరు

కడప అగ్రికల్చర్: రుతుపవనాల ఆగమనంతో పాటు ఉపరితల ఆవర్తనంతో వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో మంగళవారం తెల్లవారుజామున వర్షం దంచి కొట్టింది. దీంతో పొలాలన్నీ పదును కావడంతో పంటల సాగుకు అదును ఆరంభమైంది. ఇప్పటికే జిల్లాలో రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలతోపాటు వేరుశనక్కాయలను రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీతో అందజేస్తున్నారు. దీంతో చాలామంది రైతులు ముందస్తు సత్తువ పంటగా పచ్చిరొట్ట విత్తనాలను ముమ్మరంగా సాగు చేస్తున్నారు. దీంతోపాటు పెన్నా, కుందూ నది పరివాహక ప్రాంతాలతో పాటు నీటి వసతి ఉన్న బోర్ల కింద వరినాట్లు వేస్తున్నారు. జిల్లాలో అక్కడక్కడా పత్తి, వేరుశనగ, మినుము విత్తనాలను కూడా విత్తుతున్నారు. ఈ వర్షం రాకతో పంట పొలాలు మరింతగా పదునయ్యాయి. ఇక వ్యవసాయ పనులు మరింత ఊపందుకోనున్నాయి.

కడపలో రోడ్లన్నీ జలమయం..

కడపలో కురిసిన వర్షంతో నగరంలో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి బుగ్గవంక వరకు జరుగుతున్న డ్రైనేజీ పనులతో వర్షపు నీరు పోయే ఆస్కారం లేక పోవడంతో ఆ నీరంతా రోడ్లపైకి వచ్చి చేరింది. దీంతో ఆర్టీసీ బస్టాండు మొత్తం వర్షం నీటితో నిండి కుంటను తలపించింది. అలాగే అంబేద్కర్ సర్కిల్ నుంచి కోర్టు వరకు రోడ్డు ఇరువైపులా వర్షపునీటితో నిండిపోయి జనం నానా అవస్థలు పడ్డారు. ఉదయం నుంచి దాదాపు సాయంత్రం వరకు రోడ్లపైన నీరంతా అలాగే నిలబడి ఉండటంతో పాదచారులతో పాటు వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. నగరంలోని లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి.

సీకే దిన్నెలో అత్యధిక వర్షం..

వైఎస్సార్ జిల్లాలోని సీకేదిన్నెలో అత్యధికంగా 125.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అలాగే చెన్నూరులో 111.6 మి.మీ., రాజుపాలెంలో 88.2, ప్రొద్దుటూరులో 87.4, ఖాజీపేటలో 78.4, దువ్వూరులో 76.2, మైదుకూరులో 70.8, వల్లూరులో 63.8, కమలాపురంలో 59.2, జమ్మలమడుగులో 53.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కడపలో 45.2 మిల్లీ మీటర్లు, చాపాడులో 36.2, ముద్దనూరులో 24.2, పెద్దముడియంలో 18.4, లింగాలలో 15.2, ఎర్రగుంట్లలో 15, పెండ్లిమర్రిలో 14.2, వేంపల్లిలో 10.6, మైలవరంలో 10.4, చక్రాయపేటలో 8.4, తొండూరులో 8.6, వేములలో 7, వీఎన్‌పల్లిలో 6.8, సింహాద్రిపురంలో 6.4, పులివెందులలో 3, కొండాపురంలో 2.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

ఆరుతడి పంటలకు అదును..

జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన రాజుపాలెం, జమ్మలమడుగు, ముద్దనూరు, ప్రొద్దుటూరు, పెద్దముడియం, మైలవరం, ఎర్రగుంట్ల వంటి ప్రాంతాల్లో ఈ వర్షంలో ఆరుతడి పంటలు సాగయ్యే అవకాశం ఉంది. ఇక ఖాజీపేట, సీకేదిన్నె, వల్లూరు, కమలాపురం, కడప ప్రాంతాలో సత్తువ పంటలైన జీలుగలు, జనుములను సాగు చేసే అవకాశం ఉంది. ఏది ఏమైనా ప్రస్తుతం కురిసిన వర్షంతో జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి.

పొంగిన వాగులు, వంకలు

రాజుపాళెం: రాజుపాళెం మండలంలో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. రాజుపాళెంలో సర్వజ్ఞ హైస్కూల్ వద్ద ఉన్న వడిపి వంకపై రెండు అడుగుల మేర నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఎస్సీ కాలనీలోని వీధుల్లో నీరు నిలిచిపోయింది. అలాగే రాజుపాళెం – వెంగళాయపల్లె గ్రామల మధ్య ఉన్న మదు వంక అడుగు మేర ప్రవహించింది. దీంతో కొద్ది సేపు రాకపోకలు నిలిచిపోయాయి. పొలాల్లో వర్షపు నీరు భారీగా నిలిచింది. మండల వ్యాప్తంగా 88.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. చిన్నశెట్టిపల్లె గ్రామంలోని వీధుల్లో రెండు అడుగులకుపైబడి వర్షం నీరు ఉధృతంగా ప్రవహించింది.



రాజుపాలెంలోని సర్వజ్ఞ హైస్కూల్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

పెద్దమండ్యంలో అత్యధికం

బి.కొత్తకోట: అన్నమయ్య జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం కురిసిన వర్షాల్లో తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యంలో అత్యధికంగా 90.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలు. గాలివీడులో 87.4 మిల్లిమీటర్లు, చిన్నమండెంలో 82, సంబేపల్లెలో 53.4, టి.సుండుపల్లెలో 44.2, రాయచోటిలో 35.2, లక్కిరెడ్డిపల్లెలో 36, రామాపురంలో 10.4, వీరబల్లిలో 1.2, నందలూరులో 3.4, పెనగలూరులో 22.2, రాజంపేటలో 9.4, పుల్లంపేటలో 3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ములకలచెరువులో 35 మి.మీ., తంబళ్లపల్లెలో 58.6, పెద్దమండ్యంలో 90.8, గుర్రంకొండలో 23, కలకడలో 24.4, కంభంవారిపల్లెలో 26, పీలేరులో 51.4, కలికిరిలో 37.2, వాల్మీకిపురంలో 25.2, కురబలకోటలో 70.4, పెద్దతిప్పసముద్రంలో 25.2, బి.కొత్తకోటలో 37.4, మదనపల్లెలో 89.8, నిమ్మనపల్లెలో 54.4, రామసముద్రంలో 24.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మంగళవారం ఒక్కరోజు 1,061.2 మిల్లీమీటర్ల వర్షం జిల్లాలో కురిసింది. జూన్ నెలకు సంబంధించి 18 రోజుల్లో 4,250 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలోని 30 మండలాల్లో ఓబులవారిపల్లె మండలంలో సగటు వర్షపాతం కురవలేదు. సగటు కన్నా తక్కువ వర్షం కురిసింది. ఆరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా 23 మండలాల్లో సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదైంది.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు

వాల్మీకిపురం: సోమవారం అర్ధరాత్రి కురిసిన గాలివాన బీభత్సానికి విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో రెండు విద్యుత్ స్తంభాలు ఒంగిపోయి నేలమట్టమయ్యాయి. దీంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు హుటాహుటిన విద్యుత్‌ను నిలిపివేసి, రెండు విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు నిర్వహించి, విద్యుత్‌ను పునరుద్ధరించారు.



నేలమట్టమైన విద్యుత్ స్తంభం

న్యూస్‌రీల్

ఫీజుల వివరాలు నోటీసు బోర్డులో ఉంచాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ తరగతులవారీగా విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో విద్యార్థుల తల్లితండ్రులకు తెలియచేసే విధంగా ఏర్పాటు చేయాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. అలాగే 2024–25 విద్యా సంవత్సరానికి పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం దగ్గర కొనుగోలు చేసి విద్యార్థులకు సరఫరా చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ గుర్తింపులేని పాఠశాలలు నిర్వహించకూడదన్నారు. నిబంధనలను అతిక్రమించిన యాజమాన్యాలపై కఠినమైన చర్యలు తప్పవని డీఈఓ అనురాధ హెచ్చరించారు.

పోలీసులపై కరపత్రాల కలకలం

కడప అర్బన్: కడప నగరంలో ఓ పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులు సార్వత్రిక ఎన్నికల్లో వివిధ పార్టీలకు చెందిన వారి నుంచి డబ్బులను తీసుకుని సిబ్బందికి పంపిణీ చేయకుండా అవినీతికి పాల్పడ్డారంటూ గుర్తు తెలియని వ్యక్తులు 'కరపత్రాలు' ముద్రించి రాత్రి వేళల్లో పంపిణీ చేశారు. ఈ సంఘటన పోలీసు అధికారుల్లో అసహనం, ప్రజల్లో కలకలం రేపింది. ఈ సంఘటనపై ఎవరు కరపత్రాలను తయారు చేశారు? ఎవరు పంపిణీ చేశారు? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు. అలాగే పోలీసు అధికారులు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకుని వెళ్లారు.

అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం



రాయచోటి టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించే పద్మ భూషణ్, పద్మ విభూషణ్, పద్మశ్రీ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అన్నమయ్యజిల్లా క్రీడాభివృద్ధి అధికారి గౌస్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక, సాంఘిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ప్రజా సంబంధాలు, సివిల్ సర్వీసులు, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ రంగాలలో సేవలు అందించిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం www. padmaawards.gov. in వెబ్ సైట్‌ను సందర్శించాలన్నారు.

అన్నదాతలకు అండగా కేంద్ర ప్రభుత్వం



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి, కలెక్టర్ విజయరామారాజు

కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప అగ్రికల్చర్: పంటల సాగులో కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళ వారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 17వ విడత కింద రూ.2 వేల నగదు జమ ప్రత్యక్ష వీక్షణ ప్రసార కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవీరెడ్డి, జిల్లాకు చెందిన 700 వందల మంది రైతులతో కలిసి ఆయన పాల్గొన్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ వారణాసిలో కార్యక్రమాన్ని ప్రారంభించి వివిధ ప్రాంతాల రైతులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అన్నదాతలకు అందిస్తున్న ఆర్థిక సహాయం విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొనడానికి అవసరం అవుతుందన్నా రు. మహిళలు పెరటి తోటలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ అన్నదాతలకు ఆర్థిక చేయూతను అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.6వేల సాయం మూడు విడతలుగా అందజేస్తోందన్నారు. జిల్లాలో 1,85,607 మంది రైతులకు రూ.37.36 కోట్లు పంపిణీ చేశారన్నారు. 57 మంది కృషి సఖిలకు, డీఆర్డీఏ కింద కిసాన్ సఖిలకు గుర్తింపు పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేష్, జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, కేవీకే కో ఆర్డినేటర్ వీరయ్య, ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ అంకయ్యకుమార్, వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాసాచారి, కేవీకే శాస్త్రవేత్తలు శిల్పకళ, ప్రశాంతి, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి సహస్ర కలశాభిషేకం

- మూడు రోజులపాటు ఉత్సవాలు
- సిద్ధమైన సప్తసముద్రాలు, నదుల జలాలు

కడప కల్చరల్: తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలిసారిగా మూడు రోజుల సహస్రకలశాభిషేకం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానాలు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇంతవరకు కేవలం తిరుమలలో మినహా ఇంకెక్కడా జరగని ఈ ఉత్సవాలను స్థానికంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరెడ్డి పర్యవేక్షించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

ఈ ఉత్సవాల కోసం 1008 కలశాలను తెప్పించారు. ప్రపంచంలోని సప్తసముద్రాలు, దేశంలోని సప్తనదుల జలాలతో ఉన్న ఈ కలశాలకు మూడు రోజుల పాటు పూజలు నిర్వహించి ఆ జలాలతో స్వామికి విశేష అభిషేకం నిర్వహించనున్నారు. ఈ జలాల సేకరణ అత్యంత అరుదైన అంశంగా అర్చకులు పేర్కొంటున్నారు. ఇందుకోసం ఆలయ రంగమంటపంలో 9 ప్రత్యేక వేదికలు సిద్ధం చేశారు. వాటి ఎదురుగా హోమగుండాన్ని ఏర్పాటు చేశారు. మండపం చుట్టూ స్తంభాలు విశేష అలంకారం చేశారు. ఈ మూడు రోజులు పూజలలో ఉంచేందుకు వివిధ అటవీ ప్రాంతాల నుంచి ఔషధ మొక్కలు, చెట్ల వేర్లు, బెరడు, కాండంతో పాటు దేవతావృక్షాల పత్రాలు వివిధ పవిత్ర పత్రాలు, పరిమళ ద్రవ్యాలు తెప్పించి సిద్ధంగా ఉంచారు. ఈ మూడురోజుల పూజలు టీటీడీ వేదిక్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆగమ సలహాదారులు రాజేష్‌బట్టర్ ఆధ్వర్యంలో స్థానిక అర్చక బృందం నిర్వహిస్తారు.



దేవుని కడప ఆలయం



ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పీఠాలు

పూజల వివరాలు

తొలిరోజు: బుధవారం ఉదయం 5.30 నుంచి పూజోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా భగవత్ విజ్ఞాపనము, విష్వక్సేన ఆరాధన, సహస్ర కలశాభిషేక సంకల్పం, రక్షాబంధనం, అంకురార్పణం, వాస్తుయాగం, యాగమంటప ద్వారతోరణారాధన, వేద ప్రబంధ స్తోత్ర పారాయణం, అఖండ దీపస్థాపనం నిర్వహిస్తారు.

రెండో రోజు: గురువారం ఉదయం 7.30 నుంచి సహస్ర కలశాభిషేకంతో పూజోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం 5 గంటల నుంచి సహస్రకలశ ఆవాహణారాధన నిర్వహిస్తారు.

మూడో రోజు: శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సహస్రకలశాభిషేకం, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, అలంకారం, శాత్తుమొర, మహదాశీర్వాదం, సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

సరిహద్దులు దాటారు!

- కన్నడిగుల గుప్పిట్లో ప్రభుత్వ భూములు
- 500 ఎకరాలకుపైగా వారి చేతుల్లోనే
- తిరిగి స్వాధీనానికి కనీస చర్యల్లేవు
- 10 ఏళ్ల క్రితం మొక్కుబడిగా పదెకరాల రద్దు



బి.కొత్తకోట మండలం మొటుకు వద్ద ప్రభుత్వ భూమిలో కర్ణాటక వాసుల సాగు (ఫైల్)

బి.కొత్తకోట: సెంటు స్థలం ఇవ్వాలంటే సవాలక్ష విచారణలు జరిపే అధికారులు మన రాష్ట్రం కాని వారికి ఎకరాలకు ఎకరాలు ఇచ్చేశారు. ఇది గత కొన్నేళ్లుగా సాగుతూనే ఉన్నా భూ పంపిణీ మాత్రం ఆగడం లేదని తెలుస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గం కర్ణాటక సరిహద్దులో ఉంది. ఈ సరిహద్దుల్లోనే ప్రభుత్వ భూములు విరివిగా ఉన్నాయి. మన ప్రాంత పేదలకు ఆసరాగా నిలవాల్సిన అధికారులు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారికి రెవెన్యూ అధికారులు యథేచ్ఛగా భూములు ఇచ్చేస్తున్నట్టు సమాచారం. పదేళ్ల క్రితం కర్ణాటక వ్యక్తులకు ఇచ్చిన 10 ఎకరాల పట్టాలను రెవెన్యూ అధికారులు రద్దు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఇంకా 500 ఎకరాలకు పైగా కర్ణాటక వాసుల చేతుల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

- తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాలు కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్నాయి. బి.కొత్తకోట మండలంలోని గట్టు, బడికాయలపల్లె, బీరంగి గ్రామాలు, పెద్దతిప్పసముద్రం మండలంలోని బూచిపల్లె, సంపతికోట, మల్లెల, టి. సదుం, తుమ్మరకుంట గ్రామాలు పూర్తిగా కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఈ మండలాలకు చెందిన ప్రభుత్వ భూములు వేల ఎకరాల్లో ఉన్నాయి. దశాబ్దాలుగా ఈ మండలాల్లోని పేదలకు సాగు చేసుకునేందుకు డీకేటీగా ప్రభుత్వ భూములను పంపిణీ చేస్తూ వస్తున్నారు. అయితే ఈ భూములు సరిహద్దులోని కర్ణాటక వాసుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. గత 25 ఏళ్లలో కర్ణాటక వాసులకు మన ప్రభుత్వ భూములను వారి చేతుల్లో పెడుతూ వస్తున్నారు. ఇక్కడి భూములు దక్కించుకొనేందుకు తెలివిగా బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం మండలాల్లో నివసిస్తున్నట్లు రేషన్ కార్డులు కూడా పొందుతున్నారు. దీన్ని అధారంగా చూపి పీటీఎం మండలంలో అత్యధికంగా కర్ణాటక వాసులు భూములు పొందినట్లు సమాచారం. బి.కొత్తకోట మండలం మొటుకు సరిహద్దు ప్రాంతాల్లో కర్ణాటక వాసులు అనుమతులు లేకుండానే ప్రభుత్వ భూములు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. కర్ణాటక వాసులకు భూములు కేటాయించే విషయంలో రెవెన్యూ అధికారులు నిబంధనలు పాటించలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. స్థానికంగా ఉన్న నిరుపేదలకు దక్కాల్సిన ప్రభుత్వ భూములు పొరుగు రాష్ట్రానికి చెందిన వారి చేతుల్లోకి వెళ్తుండటంతో స్థానికంగా ఉన్న పేదలు ఎకరా భూమి పొందాలంటే ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. ఈ వ్యవహారం వెలుగులోకి రాకుండా పోతుండటంతో ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ విషయంలో రెవెన్యూ అధికారుల తీరుపై విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

క్రయవిక్రయాలతో లబ్ధి

కర్ణాటక వాసులకు కట్టబెట్టిన ప్రభుత్వ భూములతో పట్టాదారులు విలువైన ప్రయోజనాలు పొందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఏడాది 20 ఏళ్ల క్రితం పట్టాలు పొందిన డీకేటీ భూములను విక్రయించుకునేందుకు అనుమతి ఇవ్వడంతో లబ్ధిదారులు భారీ ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు. డీకేటీ భూముల క్రయ విక్రయాలు జరుగుతుండటంతో కన్నడిగులు తమ చేతుల్లోని భూములను విక్రయించి లబ్ధి పొందుతున్నారు. కాగా సరిహద్దు గ్రామాల్లోని ప్రభుత్వ భూములు ఏ మేరకు కర్ణాటక వాసుల చేతుల్లో ఉన్నాయో నిగ్గు తేల్చేందుకు ఉన్నతాధికారులు చర్యలు చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

పదెకరాల రద్దుతో సరి

కర్ణాటక వాసులకు ప్రభుత్వ భూములు కట్టబెట్టిన వ్యవహారాల్లో పెద్దతిప్పసముద్రం రెవెన్యూ అధికారులు 10 ఏళ్ల క్రితం మొక్కుబడిగా స్పందించారు. తుమ్మరకుంట పంచాయతీలో సర్వే నంబరు 1893లో కర్ణాటక వాసులకు ఇచ్చిన 10 ఎకరాల భూమిని రద్దు చేశారు. అయితే వందలాది ఎకరాలపై మాత్రం రెవెన్యూ అధికారులు స్పందించలేదు. అయితే 1996లో కర్ణాటక వాసులు మండలంలో రేషన్‌కార్డులు పొందినట్టు గుర్తించి ఆరు కార్డులు రద్దు చేశారు. ఇంతకు మించి రెవెన్యూ అధికారులు తీసుకున్న చర్యలు లేవు. కన్నడిగుల చేతిలో వందలాది ఎకరాల భూములపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

అడ్వాన్స్‌డ్‌లో సెకండ్ క్లాస్

- ఇంటర్ సప్లిమెంటరీలో 54 శాతం మంది ఉత్తీర్ణత
- రాష్ట్రంలో జిల్లాకు 18వ స్థానం

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను మంగళవారం మధ్యాహ్నం ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. ఈ పరీక్ష ఫలితాల్లో వైఎస్సార్‌జిల్లా రాష్ట్రంలో 18వ స్థానంలో నిలిచింది. మే నెలలో ఈ పరీక్షలను జిల్లావ్యాప్తంగా 4759 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వారిలో 2592 మంది ఉత్తీర్ణులయ్యారని ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. దీంతో 54 శాతం మేర ఉత్తీర్ణతను సాధించినట్లు తెలిపారు.

యాజమాన్యం	కాలేజీల సంఖ్య	పరీక్ష రాసిన వారు	పాస్ అయిన వారు	ఉత్తీర్ణత శాతం
ప్రభుత్వ	20	813	439	54
ఎయిడెడ్	06	199	123	63
హైస్కూల్ ప్లస్	05	45	24	53
మోడల్	03	102	69	68
ఏపీఎస్‌డబ్ల్యు	11	225	148	66
కేజీబీవీ	17	116	79	68
కోఆపరేటివ్	01	44	19	43
ప్రైవేటు	75	3215	1691	53
మొత్తం	138	4759	2592	54

క్లుప్తంగా

కణితిని ఢీకొన్న వాహనం



తీవ్ర గాయాల పాలైన కణితి

అట్లూరు : కడప–బద్వేల్ ప్రధాన రహదారిపై సిద్దవటం–అట్లూరు మార్గంలోని అటవీ ప్రాంతంలో రోడ్డు దాటుతున్న జంతువు కణితిని సోమవారం గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయాలయ్యాయి. వాహనదారులు గుర్తించి అట్లూరు చెక్ పోస్టు వద్ద సిబ్బందికి తెలిపారు. గాయపడిన కణితిని వైద్య చికిత్స కోసం తరలించారు.

ఆలయం వద్ద మృతదేహం లభ్యం



ఆలయం వద్ద గుర్తు తెలియని మృతదేహం

సిద్దవటం : మండలంలోని శివునిపల్లె గ్రామం సమీపంలో కాశిరెడ్డి నాయన స్వామి ఆలయం వద్ద మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానికుల వివరాల మేరకు కాశిరెడ్డినాయనస్వామి ఆలయం వద్ద మృతదేహం ఉందని తెలుసుకుని సిద్దవటం పోలీసులకు తెలియజేశామన్నారు. వారు స్థలానికి వచ్చి మృతుడి వివరాలు పరిశీలించినట్లు తెలిపారు. అనాథ మృతదేహం కావడంతో అంత్యక్రియలు చేయాలని పరమాత్మ సేవా వారికి సూచించామని తెలిపారు.

వరుస చోరీలతో ఆందోళన



దుకాణాలకు తాళాలు పగులగొట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో వరుసగా చోరీలు చోటు చేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారంలో రెండుమార్లు ఏదోచోట గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడుతున్నారు. ఐదు రోజుల కిందట సత్రం బడి సమీపంలో కూల్ డ్రింక్ షాప్‌లో శీతల పానీయాలు అపహరించారు. సోమవారం రాత్రి బీఎస్ఎన్ఎల్ సమీపంలోని దుకాణాల్లో సరకులు చోరీ చేశారు. ఎప్పుడు ఎక్కడ చోరీ జరుగుతుందో అని జనం ఆందోళనకు గురవుతున్నారు.

ఇసుక మాఫియాను అరికట్టండి

రాయచోటి టౌన్ : సామాన్యులకు అందకుండా ఇసుక తరలిస్తున్న మాఫియా ఆగడాలను అరికట్టాలని బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి చీర్ల శ్రీనివాసయాదవ్ కోరారు. సామాన్యులు ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నా.. ఇసుక మాఫియా మాత్రం అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు.



అమ్మో.. దోమ

- వర్షాకాలంలో లోపిస్తున్న పారిశుద్ధ్యం
- విష జ్వరాల బారిన పడుతున్న జనం
- జిల్లాలో 91 డెంగీ, రెండు మలేరియా కేసులు

దోమ.. పేరు చిన్నదేకానీ.. దాని కాటుతో ఏటా వందలాది మరణాలు సంభవిస్తున్నాయి.. ఆడ దోమ కుట్టి మలేరియా వ్యాధి కారణమై.. ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టిస్తోంది. వానాకాలం వస్తే చాలు విజృంభిస్తూ మనుషుల ప్రాణాలు తీసేస్తోంది. వర్షాకాలం కావడంతో నీరు నిల్వ ఉండడంతో విపరీతంగా దోమలు వృద్ధి చెందుతున్నాయి. వర్షపు నీరు నిలిచి మురికి కూపాలు తయారై వాటికి ఆవాసంగా మారాయి. దోమ కాటుతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో పారిశుద్ధ్య నిర్వహణ అంత్యంత అవసరమని వైద్యులు సూచిస్తున్నారు.



ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట నిలిచిన మురుగునీరు



జిల్లా కోర్టు ఎదుట నిలిచిన మురికి నీటిలో తేలియాడుతున్న దోమలు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ జిల్లాలో కడప నగర పాలక సంస్థతోపాటు ప్రొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు, జమ్మలమడుగు, బద్వేల్, కమలాపురం మున్సిపాలిటీలు, 557 గ్రామ పంచాయితీలున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో నీరు నిలిచి పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురుగు పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారింది. ఇప్పటికే వైఎస్సార్ కడప జిల్లాలో 91 డెంగీ, 2 మలేరియా కేసులు నమోదయ్యాయి. కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు, జిల్లా కోర్టు, ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట చిన్నపాటి వర్షానికే నీరు రోడ్డుపై నిల్వ ఉండి దోమల వ్యాప్తికి కారణమవుతోంది.

చర్యలకు ఉపక్రమించాల్సిందే..

మునిసిపాలిటీ, పంచాయతీలలో దోమల నివారణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తుంటారు. ఏడాదికి కార్పొరేషన్‌లో సుమారు రూ.10 లక్షలు, గ్రేడ్‌ను బట్టి మున్సిపాలిటీలో అయితే రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు బడ్జెట్‌లో దోమ నివారణకు కేటాయిస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు పలు విభాగాలలో ఈ ప్రక్రియ జరుగుతుంది. ఉదయం డ్రెయిన్లలోనూ, గుంతలలోనూ మలాథియాన్ స్ప్రే చేస్తారు. రోజులపాటు నానబెట్టిన ఆయిల్ బాల్స్ డ్రైనేజీలో వదులుతారు. వాటి వల్ల లార్వా నాశనమవుతుంది. సాయంత్రం వేళ ఫాగింగ్ యంత్రం ద్వారా పొగ వదులుతారు. విశాలంగా ఉండే డ్రెయిన్లలో గంబూచియా చేపలను వదులుతారు. ఇవి దోమలను తింటాయి. ఈ చర్యలు చేపట్టకపోతే దోమలు విజృంభించే అవకాశం ఉంది.

దోమ కుడితే సోకే వ్యాధులు..

మలేరియా.. ఆడ అనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియాతో బాధపడుతున్న రోగిని దోమ కుట్టడం వల్ల దాని కడుపులోకి వ్యాధికారక పరాన్న జీవి ప్రవేశించి అక్కడ పెరుగుతుంది. ఇదే దోమ మరో వ్యక్తిని కుట్టినప్పుడు ఆ వ్యక్తి రక్తంలోకి చేరి మలేరియాకు కారణమవుతుంది. చలి, వణుకుతో జ్వరం, శరీర ఉష్ణోగ్రత పెరగడం.. జ్వరం వస్తూ పోతూ ఉంటుంది.

డెంగీ..

పగటి సమయంలో కుట్టే యెడీస్ ఆడ దోమల ద్వారా డెంగీ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరస్ జ్వరం, కండరాలు, కీళ్ళ నొప్పులతో జ్వరం మొదలవుతుంది. ప్లేట్‌లెట్లు అమాంతం తగ్గిపోయి.. హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాలు భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండటంతో పాటు చిగుళ్ళు, ముక్కు రక్తం వస్తుంది.

మెదడు వాపు..

క్యూలెక్స్ ఆడదోమ కుట్టడం వల్ల మెదడువాపు వ్యాధి సంక్రమిస్తుంది. జపనీస్ ఎన్సెఫలైటీస్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది. ఆకస్మిక జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువగా ఉండడం, విపరీతమైన తలనొప్పి, వాంతులు కావడం, అపస్మారక స్థితికి లోనుకావడం, శరీరంలో ఏదో ఒక పక్క పక్షవాతానికి గురికావడం, ఫిట్స్ రావడం.

చికెన్ గున్యా..

ఎడిస్ దోమల వల్ల ఈ వ్యాధి వస్తుంది. చేతులు, కాళ్ళలో, కీళ్ళల్లో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా తయారవుతాడు. తలనొప్పి, వాంతులు, వికారంతో పాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ళ నొప్పులు, సరిగా నిలబడలేకపోవడం.

ఫైలేరియా..

దీనిని బోధకాలు అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వస్తుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోధకాలు సోకుతుంది. తరచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిళ్లలు కట్టడం, అవయవాల వాపు, చేతులు, స్థనాలు, వరిబీజం జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



- ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- నిల్వ ఉన్న గుంతలలో క్రిమిసంహారక మందులు, కిరోసిన్ లేదా వాడిన ఇంజనాయిల్లో ముంచిన గుడ్డలు వేయాలి.



- మురుగు నీరు బయటకు వెళ్లిపోయే విధంగా చర్యలు తీసుకోవాలి. నీటి ట్యాంకులు, డ్రమ్ములపై మూతలు సరిగా ఉంచాలి.
- ఇంట్లో, ఇంటి చుట్టూ పనికిరాని కూలర్లు, పాత టైర్లు, డ్రమ్ములు, వాడని రోళ్ళు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు, సీసాలు లేకుండా చూసుకోవాలి.
- కిటికీలకు, డోర్లకు జాలీలు బిగించాలి. వ్యక్తిగత రక్షణకు దోమతెరలు, కాయిల్స్ వాడాలి. శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలి.



దోమల నివారణకు చర్యలు తీసుకున్నాం

కడప నగరంలోని అన్ని డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాం. పగలు, రాత్రి ఫాగింగ్ చేస్తున్నాం. 20 మంది బృందంతో పిచికారీ చేయిస్తున్నాం. యాంటీ లార్వా ఆపరేషన్‌లో భాగంగా నీటి నిల్వలున్న ప్రాంతాల్లో గంబూషియా చేపలు వదులుతున్నాం. ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో మురుగునీటి గుంతలు, ఖాళీ కొబ్బరి బోండాం చిప్పలు, చెత్తా, చెదారాలు, పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి.

– చంద్రశేఖర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

హాస్టళ్లలో దోమల నియంత్రణకు చర్యలు

జిల్లాలోని 150 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లలో దోమల నియంత్రణకు ముందస్తుగా లిక్విడ్ పిచికారీ చేయిస్తున్నాం. మలేరియా, డెంగ్యూ, ఇతర కేసులు నమోదైన చోట ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. ప్రజలు కూడా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. పిల్లలను వర్షంలో తడవకుండా చూస్తూ కాచి చల్లార్చిన నీటినే తాగాలి. బయట ఆహార పదార్థాలను తీసుకోరాదు.

– మనోరమ, జిల్లా మలేరియా అధికారి

బస్సు హెల్పర్‌పై దాడి కేసులో ముగ్గురి అరెస్టు

పరారీలో ఏఎస్ఐ, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీసీ పాత అసుపత్రి ఆవరణంలో 2023 డిసెంబర్, 30న హెల్పర్ డి.ప్రసాద్‌పై కె. రవి కుమార్, కె.కిషోర్‌కుమార్, మరో ఐదుగురితో కలిసి దాడి చేసిన సంఘటనలో సోమవారం రాత్రి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సంఘటనలో అరెస్టయిన వారిలో కె.రవి కుమార్, ప్రశాంత్, మునీంద్ర ఉన్నారు. ఇంకా ఈ కేసులో నిందితులైన అన్నదమ్ములు వరప్రసాద్ అలియాస్ ప్రసాద్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ విజయకుమార్, ఏఎస్ఐ భాస్కర్‌తోపాటు కిషోర్ కుమార్ పరారీలో వున్నారు. నిందితుల కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టామని, వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ వెల్లడించారు.

ఉద్యోగాలు భర్తీ చేయండి



రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖకు విజ్ఞప్తి చేస్తున్న అభ్యర్థులు

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల(రిమ్స్) ఆవరణం లోని మానసిక వైద్యశాల, కేన్సర్ వైద్యశాల, పులివెందులలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో నియామకాలను భర్తీ చేయాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖను కలిసి తమ ఆవేదన వినిపించారు. వారు మాట్లాడుతూ వ్యయప్రయాసల కోర్చి దరఖాస్తు చేసుకోగా, పోస్టుల భర్తీ ప్రక్రియ ఆలస్యం చేశారన్నారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ అభ్యర్థుల విజ్ఞప్తిని కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

మహిళకు గాయాలు

మదనపల్లె : విద్యుత్తు షాక్‌తో మహిళ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీకి చెందిన హరికృష్ణారెడ్డి భార్య కవిత(30) ఇంట్లో విద్యుత్ స్విచ్ ఆన్ చేయగా, కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం

రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్



హోంగార్డుతో మాట్లాడుతున్న రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్

కడప అర్బన్ : సార్వత్రిక ఎన్నికల్లో హోంగార్డుల సేవలు అభినందనీయమని రాయలసీమ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్ అన్నారు. స్థానిక ఉమేష్ చంద్ర కళ్యాణ మండపంలో కడప పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులను నిర్వర్తిస్తూ పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. హోంగార్డుల దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనన్నారు. ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే సమర్థంగా విధులు నిర్వర్తించడానికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీశైల రెడ్డి, హోంగార్డ్స్ పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మేలుపట్లకు చెందిన సునీల్ భార్య స్వర్ణకుమారి(30) కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడి మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అదే విధంగా మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ నల్లగుట్టపల్లెకు చెందిన ఎస్.వెంకటరమణ భార్య నాగరత్న(35) కుటుంబ సమస్యలతో సోమవారం రాత్రి ఇంటి వద్దే పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. బాధితులను కుటుంబసభ్యులు 108 వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బీటెక్, ఎంబీఏ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న జేఎన్‌టీయూ నామినీ ప్రొఫెసర్ కిరణ్మయి

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కాలేజీలో 2023–24 విద్యా సంవత్సరం అటానమస్ బ్యాచ్‌కు చెందిన బీటెక్ సెకండ్ ఇయర్, ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. జేఎన్‌టీయూ నామినీ ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయి మాట్లాడుతూ సీబీఐటీ అటానమస్‌గా మారిన తొలి ఏడాది బీటెక్ సెకండ్ ఇయర్, ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామన్నారు. బీటెక్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో 72.22 శాతం, ఎంబీఏ నాలుగో సెమిస్టర్‌లో 88.46 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో సీబీఐటీ కళాశాల చైర్మన్ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

రిమ్స్ వైద్య విద్యార్థులకు ఉపకార వేతనాలు



రిమ్స్ వైద్య విద్యార్థిని ఆర్తి కిరణ్‌కు చెక్కు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల(రిమ్స్)లోని వైద్య విద్యార్థులు షణ్ముఖ శ్రీనివాస్, ఆర్తి కిరణ్‌లకు రూ.10,000 ఉపకార వేతనం లభించింది. వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని యుజీఎస్ఆర్ఎస్–2023 కింద వారికి ఈ స్కాలర్ షిప్ దక్కింది. నాలుగో సంవత్సరం వైద్య విద్య అభ్యసిస్తున్న ఆర్తి కిరణ్ 'స్లీప్ హైజీన్ అండ్ డే టైం స్లీపినెస్ ఇన్ అండర్ గ్యాడ్యుయేట్ మెడికల్ స్టూడెంట్స్, జీఎంసి, కడప' అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ. దివ్యశ్రీ ఆధ్వర్యంలో పరిశోధన చేసినందుకు ఈ స్కాలర్‌షిప్ లభించింది. అలాగే మూడో సంవత్సరం వైద్య విద్య అభ్యసిస్తున్న షణ్ముఖ శ్రీనివాస్ 'అసిమ్టోటోమాటిక్ బ్యాక్టీరియా ఇన్ టైప్–2 డయాబెటీస్ మెల్లిబెస్'పై మైక్రోబయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఖాజా మొహిద్దీన్ ఆధ్వర్యంలో రీసెర్చ్ చేసినందుకు ఉపకార వేతనం లభించింది. ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించి రూ.10వేల చెక్కులు అందజేశారు.

సోమేశ్వరాలయానికి రూ.8.08 లక్షల ఆదాయం



ఆలయ భూములకు వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు సోమేశ్వరాలయానికి సంబంధించిన 178.59 ఎకరాల భూములు కౌలుకు ఇచ్చేందుకు మంగళవారం వేలంపాట నిర్వహించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణాధికారి ఆర్ఆర్.నరసింహసింగ్, ఈఓ కె.రామచంద్రాచార్యులు వేలంపాట ప్రారంభించగా 52 మంది రైతులు పాల్గొన్నారు. 40 మంది హెచ్చుపాట పాడి భూములను కౌలుకు దక్కించుకున్నారు. మొత్తం రూ.8,08,000 ఆదాయం వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రంగేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు



నిందితుడిని చూపుతున్న సీఐ, పోలీసులు

రాయచోటి టౌన్ : చోరీ కేసులో నిందితుడు షేక్ మహమ్మద్ మోసిన్‌ను రాయచోటి అర్బన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి కథనం మేరకు.. ఈ నెల 9, 10వ తేదీల్లో రాయచోటి–చిత్తూరు రోడ్డులోని చెక్ పోస్టు, మదనపల్లె రోడ్డులో నడిచి వెళ్తున్న మహిళ నుంచి 26 గ్రాముల గొలుసు, మరో ఇద్దరు మహిళల వద్ద 40 గ్రాముల గొలుసులు దోచుకెళ్లారు. అదే రోజున బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీలలో నిందితుడు రాయచోటి పట్టణం కొత్తపల్లెలో నివాసమున్న షేక్ మహమ్మద్ మోసిన్‌గా గుర్తించి మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద సుమారు రూ.4 లక్షల విలువగల మూడు బంగారు గొలుసులు స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. ఎస్ఐ భక్తవత్సలం, సిబ్బంది జగన్, బర్కత్ నిందితుడిని పట్టుకోవడంలో చొరవ చూపినందుకు సీఐ అభినందించారు.

ఘనంగా బర్సీ మహోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి



స్వామి వారి మజార్లపై పూలచాదర్ సమర్పిస్తున్న పీఠాధిపతి

కమలాపురం : కమలాపురం పట్టణంలో వెలసిన దర్గా–ఎ–గఫారియా, జహీరియా స్వర్గీయ పీఠాధిపతి హాజి జహీరుద్దీన్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి, సజ్జాద్–ఏ–నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, దర్గా కన్వీనర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో బర్సీ మహోత్సవం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అశేష భక్త జన సందోహం నడుమ పీఠాధిపతి నివాసం నుంచి జహీరియా దర్గా వరకు గంధం ఊరేగించారు.

అనంతరం స్వామి వారి మజార్లపై గంధం ఎక్కించి, పూల చాదర్లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిపారు. రాత్రి నాత్ చదివారు. అనంతరం బయాన్ చేశారు. పీఠాధిపతి సోదరులు దస్తగిరి షా ఖాద్రి, మౌలానా, గౌస్‌పాక్, జియా మాలిక్, సర్ఫరాజ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



రోడ్డు ప్రమాద దృశ్యం

రాజంపేట : రాజంపేట – పుల్లంపేట మధ్య అశోక గార్డెన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పుల్లంపేట మండలం బావికాడపల్లికి చెందిన రమణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. బైక్‌పై రమణయ్య, మణి మంగళవారం రాజంపేటకు వస్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మణికి తీవ్ర గాయాలవగా, రమణయ్య అక్కడే మృతి చెందారు. మణిని చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై దాడి

మదనపల్లె : పాత కక్షలతో ఓ యువకుడిపై కొందరు దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె రోడ్డు బసినికొండలో నివాసముంటున్న నాగరాజు కుమారుడు వెంకటేష్(24) ఎలక్ట్రీషియన్ పనులు చేస్తున్నాడు.

స్థానికుడు శశితో పాత కక్షలుండడంతో సోమవారం రాత్రి పని ఉందంటూ వెంకటేష్‌ను జెడ్పీ హైస్కూల్ వద్దకు శశి పిలుచుకువెళ్లాడు. అక్కడ తన అనుచరులతో కలిసి వెంకటేష్‌పై దాడి చేశారు. తీవ్ర గాయాలైన వెంకటేష్‌ను స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

యువకుల మధ్య ఘర్షణ

బద్వేలు అర్బన్ : స్థానిక మైదుకూరు రోడ్డులోని ఎస్ఎంఎస్ కల్యాణ మండపం సమీపంలో మంగళవారం తాగిన మత్తులో యువకుల మధ్య ఘర్షణలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల వివరాల మేరకు.. ఎస్ఎంఎస్ కల్యాణ మండపం సమీపంలోని ఖాళీ జాగాల్లో సాయంత్రం వేళ యువకులు మద్యం తాగుతుంటారు. ఈ నేపథ్యంలో అక్కడే మద్యం తాగిన ఓ యువకుడిపై ద్విచక్ర వాహనంలో వచ్చిన ముగ్గురు యువకులు బీరు సీసాలతో దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలవగా స్థానికులు 108 సాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడిన యువకుడు సురేంద్ర నగర్‌కు చెందిన రామచంద్రగా గుర్తించారు. దాడి చేసింది ఎవరనేది తెలియాల్సి ఉంది. పోలీసులు విచారిస్తున్నారు.



దాడిలో గాయపడిన యువకుడు